
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



సోమశిలలో 36.050 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారం 36.050 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 2190 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	- రూ.63,090
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	-రూ.5,666
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,836
నవర (8 గ్రా)	- రూ.46,688

గరిష్టం/కనిష్టం 29.5 /23.2

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 72 శాతం ఉంది. జిల్లాలో చలి వాతావరణం ఉంది. బుధవారం ఆకాశం మేఘావృతమై ఉండవచ్చని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు: మహ్మదాపురం గ్రామానికి చెందిన ఉడతా కోటేశ్వరికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం నెల్లూరు క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. కోటేశ్వరి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యం చేయించుకున్నారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న మంత్రి సీఎం సహాయ నిధి నుంచి రూ.70 వేలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాడు - నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



దర్గామిట్టలోని జెడ్పీహెచ్ఎస్‌లో నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లూరు (టౌన్): జిల్లాలో ఆయా పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగర కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలసి దర్గామిట్టలోని జిల్లా పరిషత్తు హైస్కూల్, బీవీనగర్‌లోని కేఎన్నార్ మున్సిపల్ పాఠశాల, నవాబుపేటలోని బీవీఎస్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనుల వివరాలను హెడ్‌మాస్టర్లను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట నెల్లూరు నగరపాలక సంస్థ ఎస్ఈ సంపత్‌కుమార్, ఏపీఈడబ్ల్యూడీసీ ఈఈ శ్యాంసన్, డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి తదితరులు ఉన్నారు.

తుఫాన్ బాధితులకు సహాయం



బెడ్‌షీట్స్ పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో 45వ డివిజన్‌లోని రామ్మూర్తినగర్‌లో గుడిగంట దగ్గర రైల్వేట్రాక్ పక్కన నివసిస్తున్న తుఫాను బాధితులకు వస్తువులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ నెల్లూరు శాఖ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రెడ్‌క్రాస్ సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, మల్లిరెడ్డి కోటారెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి, చామర్తి జనార్దన్‌రాజు, వాకాటి విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



పతకాలు అందుకుంటున్న విద్యార్థులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రస్థాయిలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన యోగాసన పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌లో రన్నర్స్‌గా నిలిచారని యోగాసన స్పోర్ట్సు అసోసియేషన్ సింహపురి అధ్యక్షుడు సీహెచ్.పెంచలయ్య మంగళవారం తెలిపారు. ట్రెడిషనల్, ఆర్టిస్టిక్ సోలో, ఆర్టిస్టిక్ పెయిర్, రిథమిక్ పెయిర్ విభాగాల్లో జూనియర్, సబ్‌జూనియర్, సీనియర్ విభాగాల్లో 19 జిల్లాల క్రీడాకారులతో పోటీపడి 12 బంగారు, ఒక వెండి, రెండు రజిత పతకాలు సాధించారని వివరించారు. జాతీయస్థాయిలో పంజాబ్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. పతకాలు సాధించిన విజేతలు క్రీడాకారులను అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నిర్వాహకులు అనిల్‌కుమార్, బి.విజయకుమార్‌రెడ్డి, ఎం.రవీంద్ర, యోగాశిక్షకులు నరసింహశాస్త్రిలు అభినందించారు.

రైతుల దశాబ్దాల కల సాకారం

దశాబ్దాల బడుగు, బలహీన వర్గాల రైతుల నిరీక్షణ ఫలించింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఎంతమంది నాయకులు వచ్చినా అమలు చేయలేని భూ సంస్కరణలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసింది. ఎట్టకేలకు రైతుల ఆశలు ఫలించాయి.

- భూ పంపిణీతో పేద కర్షకుల ఆనందం
- సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు
- చుక్కల భూముల సమస్య నుంచి విముక్తి
- ఇనామ్ భూములకు శాశ్వత భూహక్కు

పొదలకూరు: ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టా కాగితాలు చూడలేమని, భూములను అమ్ముకోలేమని భావించిన రైతుల కల సాకారం అయ్యింది. ప్రభుత్వం చేపట్టిన భూ సంస్కరణల వల్ల రైతులు బాగుపడ్డారు. జిల్లా స్థాయిలో అసైన్మెంట్ భూముల పట్టాలు 5,517 మంది రైతులు 6,507 ఎకరాలు పొందితే ఇందులో ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోని రైతులు 4271 మంది 5,023.02 ఎకరాల అసైన్మెంట్ భూములకు పట్టాలు పొందారు.

అర్హులైన రైతులకే భూముల పంపిణీ

గత టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలను ఆయా నియోజకవర్గాల అసైన్మెంట్ కమిటీ చైర్మన్లుగా తప్పించి జిల్లా ఇన్‌చార్జి మంత్రికి బాధ్యతలు అప్పగించారు. వారు అసైన్మెంట్ కమిటీ అనుమతులను మమ అనిపించారు. దీంతో అర్హులైన రైతులు భూములు పొందలేకపోయారు. గ్రామాల్లో టీడీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు అక్రమమార్గంలో భూములకు పట్టాలు పొందారు. ఫలితంగా సాగు చేసుకునే వారు ఒకరు, పట్టాలు పొందిన వారు మరొకరు కావడం వల్ల గ్రామాల్లో భూ తగాదాలు పెరిగాయి. ఇప్పటికీ ఆ తగాదాలు కొనసాగుతూనే ఉండడం గమనార్హం. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎమ్మెల్యేలనే అసైన్మెంట్ కమిటీ చైర్మన్లుగా కొనసాగించి అర్హులైన రైతులకు భూములను కేటాయించింది. గతంలో వివాదాస్పదంగా మారిన భూములకు సైతం పరిష్కార మార్గం చూపింది. దీంతో పట్టాలు పొందిన రైతులు విలువైన తమ భూములకు శాశ్వత యజమానులుగా మారారు.

ప్రభుత్వానికి రుణపడి ఉన్నాం



భూములకు పట్టాలను అందజేసిన జగన్ ప్రభుత్వానికి రుణపడి ఉన్నాం. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సమయం వచ్చింది. మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని నిరూపించుకున్నారు.

– షేక్ జమీలా, ఆల్తుర్తి గ్రామం

పేదలకు పట్టాలు ఇస్తారనుకోలేదు



పేదలు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇస్తారనుకోలేదు. గతంలో ప్రదక్షిణలు చేసినా సాగుచేసుకునే కొద్దిపాటి భూమికి పట్టా ఇవ్వలేదు. అయితే జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం సంతోషంగా ఉంది.

– నిమ్మక్ష మహాలక్ష్మమ్మ, పులికల్లు

ఇంతటితో ఆగిపోదు



భూముల పంపిణీ ఇంతటితో ఆగిపోదు. అర్హులైన వారిని తిరి గి గుర్తించి పట్టాలను అందజే యడం జరుగుతుంది. ఇంత పెద్ద ఎత్తున భూ పంపిణీ జరగ డం ఎన్నడూ చూడలేదు. ఉన్నత స్థాయి అధికారులతో పాటు, జిల్లా మంత్రి గోవర్ధన్‌రెడ్డి కృషి కూడా ఉంది. – ఎ.మలోల, ఆర్డీఓ, నెల్లూరు



పొదలకూరులో భూ పట్టాలను అందజేస్తున్న మంత్రి కాకాణి, కలెక్టర్ హరినారాయణన్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ తదితరులు (ఫైల్)

ఇవీ వివరాలు

అసైన్మెంట్ భూములు 6,507.37 ఎకరాలు	పట్టాలు పొందినవారు 5,517 మంది
ఇనాం భూములు 61.93 ఎకరాలు	పట్టాలు పొందింది 48 మంది
చుక్కల భూములు 2,565 ఎకరాలు	పట్టాలు పొందింది 1,407 మంది

భూ పంపిణీ కొనసాగుతుంది

అర్హులైన ప్రతి ఒక్కరికీ గ్రామాల్లో భూ పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. పొరపాట్లు ఉంటే అధికారులు, నాయకులు కలసి సరిదిద్ది తిరిగి రైతులకు భూ పట్టాలను అందజేయనున్నారు. ఇదే విషయాన్ని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇటీవల పలుమార్లు సభాముఖంగా వెల్లడించారు. అర్హులైన ఏ రైతు ఆందోళన చెందాల్సిన పనిలేదని అనివార్య కారణాల వల్ల అర్హులైన వారు భూమిని పొందలేకపోతే తన దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరించి పట్టాలను అందజేస్తామన్నారు.

ఉదయగిరి సీహెచ్‌సీలో తొలి సిజేరియన్ కాన్పు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న రజిత

ఉదయగిరి: ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో తొలిసారిగా మంగళవారం ఓ గర్భిణికి వైద్యులు విజయవంతంగా సిజేరియన్ నిర్వహించారు. వైద్యశాల ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు సిజేరియన్ చేసిన దాఖలాలు లేవు. ఈ సందర్భంగా వైద్యశాల డీడీఓ అనూష మాట్లాడుతూ దుత్తలూరు మండలం ఏసీ నగర్ కాలనీకి చెందిన యనమల రజిత పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారన్నారు. ఆమెకు గైనకాలజిస్టు అనుసిక్త పరీక్షలు నిర్వహించి కవలలు ఉన్నట్లు గుర్తించి సిజేరియన్ విజయవంతంగా చేశారు. తల్లి, ఇద్దరు మగశిశువులు ఆరోగ్యంగా ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా అనుసిక్తకు సహచర వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

14న తేనెటీగల పెంపకంపై శిక్షణ

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని బీవీనగర్‌లో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 14వ తేదీన తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇస్తున్నట్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 18 ఏళ్లు నిండిన నిరుద్యోగ యువత, గృహిణిలు, ఔత్సాహికులు పాల్గొనవచ్చన్నారు.

జయహో జగన్ పాదయాత్రకు ఘన స్వాగతం



కోవూరులో ఎమ్మెల్సీ రఘురామరాజు పాదయాత్ర

కోవూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా ముఖ్యమంత్రి కావాలనే సంకల్పంతో శాసనమండలి సభ్యుడు ఇందుకూరు రఘురామరాజు విజయనగరం నుంచి తిరుమలకు చేపట్టిన జయహో జగన్ పాదయాత్ర మంగళవారం కోవూరులోకి ప్రవేశించింది. 820 కిలోమీటర్ల మేర 43 రోజుల పాటు సాగనున్న ఈ పాదయాత్రకు కోవూరు పొలిమేరల్లో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిలో ఉన్న షిరిడీ సాయి మందిరంలో ఆలయ ధర్మకర్త రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాదయాత్రగా కోవూరు పురవీధుల్లో పర్యటించారు. అనంతరం ఎమ్మెల్సీ రఘురామరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నా ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమం తప్పకుండా నెరవేరుస్తూ ముఖ్యమంత్రి ముందుకు సాగుతున్నారన్నారు. ఈ రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్సీ రఘురామరాజు 820 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేయడం అభినందనీయమన్నారు. స్థానిక బజార్ సెంటర్లో అత్తిపల్లి అనూపరెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో స్వాగతం ఏర్పాట్లు చేశారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి, అంబేడ్కర్ విగ్రహానికి, మహాత్ముని విగ్రహానికి ఈ సందర్భంగా నేతలు పూలమాలలు వేశారు. అనంతరం స్థానిక సాలుచింతల సెంటర్లో మండల పార్టీ కన్వీనర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి డీఎల్డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్ రెడ్డి, గంగవరం సర్పంచ్ లక్ష్మీకుమారి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి రంగడి సన్నిధిలో అధ్యయనోత్సవాలు

నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీతల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఈ నెల 13 నుంచి జనవరి 2వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు (పగల్‌పత్తు – రాపత్తు ఉత్సవా లు) జరుగనున్నాయని దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఆళ్వార్లుగోష్ఠిగా స్వామి వారి సమక్షంలో 21 రోజులు 'నాలాయిర దివ్య ప్రబంధము' గానంతో ఉత్సవాలు జరుగుతాయన్నారు. డిసెంబరు 13 నుంచి 22 వరకు పగల్‌పత్తు ఉత్సవాలు, డిసెంబరు 23 నుంచి జనవరి 2 వరకు రాపత్తు ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అక్రమ లేఅవుట్లను ఉపేక్షించొద్దు

- డిజిటల్ చెల్లింపులపై దృష్టి పెట్టండి
- పంచాయతీల్లో డెవలప్‌మెంట్ ప్లాన్‌ను రెడీ చేయండి
- అధికారులకు డీపీఓ సుస్మితారెడ్డి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ సుస్మితారెడ్డి

నెల్లూరు(పొగతోట): గ్రామ పంచాయతీల్లో అక్రమ లేఅవుట్లను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని డీపీఓ సుస్మితారెడ్డి ఈఓపీఆర్డీలను ఆదేశించారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో డీఎల్‌పీఓలు, ఈఓపీఆర్డీలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇంటి పన్నులు, పన్నేతరములను వంద శాతం డిజిటల్ చెల్లింపుల ద్వారా వసూలు చేయాలన్నారు. గ్రంథాలయాల బకాయిలను చెల్లించాలన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం ద్వారా సర్వేను వేగవంతం చేయాలన్నారు. సర్వేకు సంబంధించి జిల్లా, డివిజన్ స్థాయిల్లో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. తుఫాను ప్రభావిత గ్రామాల్లో మంచినీరు, విద్యుత్ సరఫరా పూర్తి స్థాయిలో అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలలో డెవలప్‌మెంట్ ప్లాన్‌ను సిద్ధం చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి జరిగే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మిషన్ వాత్సల్య, బాల్య వివాహాల నిర్మూలన, విశ్వకర్మ యోజన, నవరత్నాలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్‌పీఓలు, ఈఓపీఆర్డీలు పాల్గొన్నారు.

జిల్లా నుంచి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీకి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా, యువజన కమిటీలను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ప్రకటించారు. ఇందులో నెల్లూరు జిల్లా నుంచి మహిళా విభాగంలో జనరల్ సెక్రటరీగా పుట్టా ధనలక్ష్మి, జాయింట్ సెక్రటరీలుగా పెరుమాళ్ల పద్మజ, షేక్ మొబినాలు నియమితులయ్యారు. యువజన విభాగంలో అఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా జీవీ ప్రసాద్, సెక్రటరీగా యాకసరి రంజిత్ కిరణ్, జాయింట్ సెక్రటరీగా ఆండ్రా రాజశేఖర్‌రెడ్డిలను నియమించారు.



ఆండ్రా రాజశేఖర్‌రెడ్డి



జీవీ ప్రసాద్

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ఇనమడుగు వద్ద తుఫాన్‌కు పాడైన వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కోవూరు: కోవూరు మండలం ఇనమడుగు తదితర ప్రాంతాల్లో ఇటీవల మిచాంగ్ తుఫాన్‌కు దెబ్బతిన్న వరి, అరటి, తమలపాకు తోటలను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి మంగళవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ సి.రమణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి ఎంవీ సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ తుఫాన్ వలన దెబ్బతిన్న పంటల రైతులు వెంటనే రైతుభరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. వరిపంట ఎక్కువగా నారుమడుల దశలో దెబ్బతిందని, రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో వరి విత్తనాలను పంపిణీ చేస్తోందన్నారు. ప్రస్తుతం నారుమడిలో నీరు ఉన్నట్లయితే బయటకు తీసివేసి 5 సెంట్ల నారుమడికి ఒక కేజీ యూరియా, ఒక కేజీ పొటాష్ వేసుకోవాలన్నారు. అదే విధంగా అరటి తోటల్లో గాలికి చెట్లు పడిపోయి ఉన్నాయని, కొంచెంగా వాలిఉన్న చెట్లను కర్రల ఊతంతో నిలబెట్టుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎండు తెగులు వ్యాపించే అవకాశం ఉన్నందున రైతులు తప్పనిసరిగా ఒక లీటర్ నీటిలో ఒక గ్రాము కార్బండిజమ్ ద్రావణాన్ని చెట్ల మొదలు దగ్గర తడిచేలా పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యానశాఖ అధికారి విశాల్, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వినీత, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఈసారి 15 వేల మందికి 'విజయదీపిక'

- జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ
- 16న జెడ్పీ సమావేశంలో లాంఛనంగా ప్రారంభం



నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జిల్లా పరిషత్ సభ్యులు, అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో 10వ తరగతి విద్యార్థులకు విజయదీపిక బుక్స్ పంపిణీ చేయగా 64.2 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థులకు ముందుగా విజయదీపిక బుక్స్ అందజేయాలని చైర్‌పర్సన్, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి నిర్ణయించారు. ఈ నెలలో సుమారు 15 వేల మందికి బుక్స్ అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నెల 16న జరిగే జెడ్పీ సర్వసభ్య సమావేశంలో వాటిని ప్రారంభించి పాఠశాలలకు సరఫరా చేసేలా అధికారులు దృష్టి సారించారు. విజయదీపికను తెలుగు, ఇంగ్లిషు మాధ్యమాలలో సిద్ధం చేశారు. గడచిన రెండు సంవత్సరాల్లో పరిశీలిస్తే 10వ తరగతి ఉత్తీర్ణత శాతంలో జిల్లా వెనుకబడి ఉంది. దీంతో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా జెడ్పీ పాలకవర్గం, అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లా పరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించేలా చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులందరికీ విజయదీపిక

జెడ్పీ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ విజయదీపిక బుక్స్ అందించేలా చర్యలు తీసుకున్నాం. తెలుగు, ఇంగ్లిషు రెండు భాషల్లో బుక్స్ సిద్ధం చేశాం. టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాం. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బుక్స్ సిద్ధం చేశాం.

–ఆనం అరుణమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు

జెడ్పీ పాఠశాలల్లో 15 వేల మంది 10వ తరగతి చదివే విద్యార్థులు ఉన్నారు. అందరికీ విజయదీపిక బుక్స్ అందిస్తాం. ఈ నెల 16న జెడ్పీ సర్వసభ్య సమావేశంలో విజయదీపిక బుక్స్ ప్రారంభించేలా చర్యలు తీసుకున్నాం. జెడ్పీ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాం.

–బి చిరంజీవి, జెడ్పీ సీఈఓ

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే ప్రసన్న



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్నకు ముఖ్యమంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

జాలర్ల వలలో కొండ చిలువ



కొండ చిలువను చూపుతున్న జాలరి

ఆత్మకూరురూరల్: చేపలు పట్టేందుకు వెళ్లిన జాలర్ల వలలో భారీ కొండచిలువ చిక్కిన ఘటన ఆత్మకూరు మండలం మహిమలూరులో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. మహిమలూరు గ్రామానికి చెందిన కొందరు జాలర్లు రోజులాగే గ్రామానికి సమీపంలో ఉన్న జిల్లా వాగులో చేపలు పట్టేందుకు వెళ్లారు. వారి వలలో భారీ కొండ చిలువ చిక్కింది. అయితే వల నిండా చేపలు పడ్డాయనుకున్న జాలర్లు నీటిలో నుంచి వలను బయటికి లాగడంతో కొండచిలువ మెలికలు తిరుగుతూ ఉండడంతో తొలుత భయభ్రాంతులకు గురయ్యారు. సమీపంలోని జాలర్లను పిలిచి వల నుంచి కొండచిలువను తీసేందుకు ప్రయత్నించగా అప్పటికే కొండ చిలువ మరణించిందని గుర్తించారు. ఆ కొండచిలువను చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపారు.

తెలుగు మహాసభలకు తరలిరండి



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న బలరామయ్య నాయుడు, రమేష్‌బాబు తదితరులు


నెల్లూరు(బృందావనం): రాజమండ్రిలో జనవరి 5, 6, 7 తేదీల్లో జరగనున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో జిల్లాకు చెందిన కవులు, రచయితలు, తెలుగు భాషాభిమానులు, సాహితీవేత్తలు పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్ర సారస్వత పరిషత్ నెల్లూరు శాఖ సంచాలకులు నలుబోలు బలరామయ్యనాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో సోమవారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర సారస్వత పరిషత్ నిర్వాహకులు కేవీవీఎస్ఎన్ రాజు, కేసీ రాజు రామప్రసాద్, గజల్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ మహాసభలు మూడు రోజులు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్ర సారస్వత పరిషత్ నెల్లూరు శాఖ ఉప సంచాలకులు ఎస్వీ రమేష్‌బాబు, వివిధ సంస్థలకు చెందిన నిర్వాహకులు పెరుగు రామకృష్ణ, ఆలూరు శిరోమణిశర్మ, పోలవరం లక్ష్మీనరసింహారావు, గోవిందరాజు సుభద్రాదేవి, శింగంశెట్టి మురళీ మోహన్‌రావు, ఎ.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: రూ.105
లేయర్ (లైవ్)	: రూ.100
బ్రాయిలర్ చికెన్	: రూ.190
స్కిన్‌లెస్ చికెన్	: రూ.210
లేయర్ చికెన్	: రూ.170



పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.25
సన్నవి	: రూ.17
పండ్లు	: రూ.5

రైతుల కల నెరవేర్చిన సీఎం జగన్

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి



పూడిపర్తిలో రైతులకు భూ పట్టాలు అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యలను పరిష్కరించి, రైతుల కల నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అసైన్‌మెంట్, ఎస్సీ కార్పొరేషన్ భూములు, చుక్కల భూముల లబ్ధిదారులకు మంగళవారం పూడిపర్తి, ఈదగాలి గ్రామాల్లో మంత్రి కాకాణి చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద రైతులు ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని పట్టాలు పంపిణీ చేయడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పూడిపర్తి గ్రామంలో 270 మంది లబ్ధిదారులకు 358 ఎకరాలు, ఈదగాలిలో 242 మందికి 328 ఎకరాలకు శాశ్వత హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల కుటుంబాలకు ఈ పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఒక్క జీఓతో చుక్కల భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు.

నమ్మక ద్రోహి చంద్రబాబు

మామకు వెన్నుపోటు పొడిచిన నమ్మక ద్రోహి చంద్రబాబు అని మంత్రి కాకాణి విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలతో 2014లో అధికారంలోకి వచ్చి, ప్రజలను అన్నివిధాలా మోసం చేశారని ధ్వజమెత్తారు. 2015లో వరదల సమయంలో పరిశీలనకు మాత్రమే బృందాలు వచ్చాయని, చంద్రబాబు ఎక్కడా రైతుకు నష్టపరిహారం ఇప్పించలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విపత్తు సమయంలో నష్టపోయిన రైతులకు అన్నివిధాలా ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. పార్టీలకతీతంగా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే నన్నారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల పెత్తనంతో టీడీపీ సానుభూతిపరులకు మాత్రమే పథకాలు దక్కేవని గుర్తుచేశారు. ఇటీవల వచ్చిన తుఫాన్ కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకారులు, గిరిజనులను ఆదుకోవాలని ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేయగా, సానుకూలంగా స్పందించారని, దీంతో సర్వేపల్లి నియోజకవర్గంలోనే 16 వేల కుటుంబాలకు రూ.2,500 ఆర్థికసాయం, బియ్యం, నిత్యావసర సరుకులు, రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేమారెడ్డి శ్యామ్‌సుందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, ఎంపీటీసీ సభ్యులు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, కోడూరు రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కాదు.. సంస్కరణలు

- ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా సంస్కరణలు తీసుకొస్తున్నారని, తద్వారా ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి సాధించిందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం పూర్తయిన సందర్భంగా మర్రిపాడు మండలంలోని చాబోలు గ్రామంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 93 సచివాలయాల పరిధిలో కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అందరూ సమష్టిగా కృషి చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి హామీని నెరవేర్చారని, విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు ఇలా ప్రతి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతోపాటు విద్యార్థుల కోసం అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాలను అమలు చేశారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంలో దాదాపు 3,200 వ్యాధులను చేర్చి అందరికీ వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. చుక్కల భూములను పరిష్కరించి రైతులకు అండగా నిలిచారని తెలిపారు. 20 ఏళ్లుగా ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ఆ భూములపై హక్కులు కల్పిస్తూ పట్టాలు అందజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, దుగ్గిరెడ్డి కృష్ణప్రసాద్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఉర్లగంటి శ్రీనివాసులురెడ్డి, రవీంద్రబాబు, రామ్మోహన్, చెవుల శ్రీనివాసులు, రేవూరు గోపాల్‌రెడ్డి, శివసాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): వివిధ స్థాయిల్లో ఉన్న భూసమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాల్సిలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆత్మకూరు నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి కలెక్టర్ ఆర్డీఓ, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో వచ్చిన రెవెన్యూ పరమైన అర్జీలను పరిష్కరించేందుకు అన్నివిధాలుగా కృషి చేయాలన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఏ మేరకు అమలు చేశారో మండలాల వారీగా సమీక్షించారు. నిర్దేశించిన వ్యవధిలో అన్ని సమస్యలను పరిష్కరించాలన్నారు. నోషనల్ ఖాతాలను ప్రారంభించేందుకు ప్రతిపాదనలు తయారు చేయడం, ఖాతా తెరిచేందుకు సమస్యలున్న గ్రామాలను గుర్తించి పరిష్కరించాలని తెలిపారు. సాదాబైనామా, ఇనామ్ భూములు తదితర భూసంబంధిత సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు వ్యక్తిగత శ్రద్ధతో పనిచేయాలన్నారు. అలాగే సాగుబడిలో ఉన్న భూమికి అర్హతల మేరకు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండో విడతలో 3 వేల ఎకరాలకు పైగా చుక్కల భూముల సమస్యను పరిష్కరించినందుకు కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, ఆత్మకూరు ఆర్డీఓ మధులత, జిల్లా ల్యాండ్ సర్వే సెటిల్‌మెంట్ అధికారి హనుమాన్ ప్రసాద్, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్‌కు భరోసా



క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. క్రీడల్లో రాష్ట్రాన్ని మేటిగా నిలిపే దిశగా 'ఆడుదాం...ఆంధ్రా' పేరుతో క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని జేబీ కళాశాలలో ఇంటర్ కాలేజ్ అథ్లెటిక్ మీట్ 2023–24 క్రీడలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నతంగా ఎదగాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెంపొందడంతోపాటు యువతలో నాయకత్వ లక్షణాలు, పోటీతత్వం పెంపొందుతాయని తెలిపారు. క్రీడలపై యువతలో ఆసక్తిని పెంపొందించేలా, క్రీడాకారులకు ప్రోత్సాహించేలా ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడోత్సవాలను నిర్వహిస్తోందని తెలిపారు. విద్యార్థులు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడాల్లో సత్తాచాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

మృతుడి వివరాలు లభ్యం

సంగం: సంగం కొండ సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారి పక్కన సోమవారం పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందిన వృద్ధుడు నెల్లూరుకు చెందిన కొండూరు వెంకటస్వామి(83)గా గుర్తించారు. మృతుడి పెద్ద కుమార్తె వెంకటరత్నమ్మ పోలీసులకు తెలిపిన వివరాల మేరకు కొండూరు వెంకటస్వామికి భార్య కామేశ్వరమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహం కాగా వయస్సు పైబడిన వెంకటస్వామి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం భార్య కామేశ్వరమ్మకు చెప్పులు తీసుకువస్తానని వెళ్లిన వెంకటస్వామి నెల్లూరు నుంచి సంగం వచ్చి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దినపత్రికల్లో వచ్చిన కథనాల ద్వారా సమాచారం తెలుసుకున్న వెంకటస్వామి కుమార్తె సంగం పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలిపారు. మంగళవారం వెంకటస్వామి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అందజేశారు.

కండలేరులో 13.118 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 13.118 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరద కాలువ నుంచి జలాశయానికి 150 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు.

నేరనియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టండి

- రౌడీషీటర్లపై నిఘా పెంచండి
- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నేరనియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టి జిల్లా ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలు అందించాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆయన నెల వారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన బుచ్చిరెడ్డిపాళెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.రామారావు మృతికి విచారం వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పోలీసు అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఇటీవల సంభవించిన మిచాంగ్ తుఫాన్ విపత్తులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో వరద బాధితులకు సహాయక చర్యలు అందించేందుకు కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. నేరాల కట్టడి, శాంతిభద్రతల పరిరక్షణ, కేసుల్లో దర్యాప్తు తదితరాలపై పోలీసు అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని రౌడీషీటర్లు, అనుమానితులు, అసాంఘిక శక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి బైండోవర్ చేయాలన్నారు. ముందస్తు సమాచారం సేకరించాలని, ఎస్‌హెచ్‌ఓలు తమ స్టేషన్ల పరిధిలో వారానికి రెండు గ్రామాలను సందర్శించి స్థానిక ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. 'జగనన్నకు చెబుదాం'(స్పందన) ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులకు న్యాయస్థానంలో శిక్షలు పడేలా చొరవ చూపాలని తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. ట్రాఫిక్ నియమాలు, మత్తు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కేసుల దర్యాప్తు, పెండెన్సీ తగ్గింపు, తుఫాన్ విపత్తులో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. సమావేశంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి



సుబ్బయ్య మృతదేహం

కందుకూరు: ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి పట్టణంలోని ప్రశాంతినగర్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ప్రకాశం కాలనీకి చెందిన వృద్ధుడు సత్తా సుబ్బయ్య(68) రోడ్డు దాటుతుండగా అదే సమయంలో కందుకూరు నుంచి వలేటివారిపాళెం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో సుబ్బయ్యకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు సుబ్బయ్యను వెంటనే కందుకూరులోని ఏరియా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుబ్బయ్య మృతిచెందాడు. ఎస్సై హనీఫ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు.

మాది పెత్తందార్ల పార్టీ కాదు.. ప్రజల పార్టీ

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మహిళా రైతుకు భూహక్కు పత్రాన్ని అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి

కలువాయి: వైఎస్సార్‌సీపీ పెత్తందార్ల పార్టీ కాదని.. ప్రజల పార్టీ అని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలువాయి మండలం కుల్లూరు ఒకటో సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో ఆయన పాల్గొని సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్నివర్గాలకు మేలు చేకూరేలా సంక్షేమ పథకాలను అమలు చేసిందని తెలిపారు. ప్రజలు కూడా ఆలోచించి తమకు ఎవరు మేలు చేశారో వారినే ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన హామీలను నూరు శాతం అమలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మాదాసు యజ్ఞపవన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూములకు శాశ్వత హక్కులు

రైతులు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములపై వారికి శాశ్వత హక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలువాయిలోని ఉమామహేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం రైతులకు పూర్తి హక్కులతో కూడిన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎవరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. రైతులు ఇక నిర్భయంగా తమ పొలాలను సాగు చేసుకోవచ్చని, క్రయ విక్రయాలకు కూడా ప్రభుత్వం హక్కులు కల్పించినట్లు తెలిపారు. మండలంలోని 650 మంది రైతులకు శాశ్వత హక్కు పత్రాలను అందజేశామన్నారు.

సాక్షి ఫ్యామిలీ
నెల్లూరు
బుధవారం ॥ 13-12-2023

నవ దిశ

బదల్తా కశ్మీర్

ఆర్టికల్ 370 ఎత్తివేతను సుప్రీంకోర్ట్ సమర్థించింది. జమ్ము-కశ్మీర్‌లకు రాష్ట్రహోదా ఇచ్చి ఎన్నికలు నిర్వహించమంది. మరోవైపు అక్కడ యువగళాలు మారుతున్న కశ్మీర్‌ను గానం చేస్తున్నాయి. 14 ఏళ్ల ర్యాపర్ హుమైరా జా విడుదల చేసిన పాట 'బదల్తా కశ్మీర్' మార్పును ఆహ్వానిస్తూ కొత్త ఆశను రేపుతోంది. హుమైరా జా పాటను భారత ప్రభుత్వం ఇన్‌స్టాలో షేర్ చేసింది. 'నేను ఇలాగే ముందుకెళ్తాను' అంటున్న హుమైరా పరిచయం.


హుమైరా జా

'బద్‌లా జొ కశ్మీర్... బద్‌లా హై సారా దౌర్' అని పాడుతోంది హుమైరా జా.

'కశ్మీర్ మారుతోంది... కశ్మీర్ ధోరణి మారుతోంది... అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది' అంటూ ఆమె పాడిన పాట ఇప్పుడు కశ్మీర్‌వాసులనే కాదు, దేశాభిమానులను కూడా ఆకర్షిస్తోంది. హుమైరా ఈ పాటను ఎం.సి.రా అనే మరో ర్యాపర్ కలిసి పాడింది. కశ్మీర్‌లో తాజా అభివృద్ధి పరిణామాలను పాటలో మిళితం చేస్తూ వీరు విడుదల చేసిన 'బదల్తా కశ్మీర్' పాట కశ్మీర్ భవిష్యత్తు మీద ఆశను కలిగిస్తోంది.

'మా నానమ్మ, తాతయ్యల కాలంలో కశ్మీర్ ఎలా ఉండేది... (ఆర్టికల్ 370 ఎత్తేశాక) ఇప్పుడు ఎలా ఉందనేది నేను వారి మాటల్లో విన్నాను. నా కళ్లారా చూశాను. ఇక్కడ జరిగిన జి 20 సమ్మిట్, శ్రీనగర్‌ను స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దడం, కొత్త టన్నెల్స్ ఏర్పాటు... ఇంతకు ముందు చూడలేదు. మా ఊరు కంగన్ నుంచి శ్రీనగర్‌కు వెళ్లాలంటే గతంలో గంటన్నర పట్టేది. ఇప్పుడు గండర్‌బల్ దగ్గర బ్రిడ్జి కట్టాక ముప్పై నిమిషాల్లో వెళ్లిపోతున్నాము. ఇదంతా మారుతున్న కశ్మీరే' అంటుంది హుమైరా జా.

తొమ్మిదో తరగతి చదువుతున్న హుమైరా అలవోకగా ర్యాప్ సాంగ్స్ రాసి పాడుతుంది. హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ పదాలను టక్కున పట్టేట్టుగా వాడుతూ పాటలు రాసి పాడటం వల్ల గతంలోనే గుర్తింపు పొందినా 'బదల్తా కశ్మీర్' పాటతో ప్రపంచానికి తెలిసింది.


హుమైరా జా

'నేను రెండో క్లాస్‌లో ఉండగా యోయో హనీసింగ్ రాప్ ఆల్బమ్ విన్నాను. అది నాకు చాలా నచ్చింది. ఆ వయసులోనే అలా ర్యాప్ పాటలు ట్రై చేసేదాన్ని. అప్పుడే బజరంగి భాయిజాన్ (2015) సినిమా షూటింగ్ మా ఏరియాలో జరిగితే అందులోని బాల నటి హర్షాలికి నేను బాడీ డబుల్ (డూప్)గా నటించాను. అలా నేను కూడా సినిమాల్లో నటించాలనుకున్నానుగానీ మా కశ్మీర్‌లో సినిమా పరిశ్రమ లేదు. అందుకని ర్యాపర్‌గా రాణించాలని నిశ్చయించుకున్నాను' అంటుంది హుమైరా.

కశ్మీర్‌లో ప్రతి ఏటా జరిగే 'ర్యాప్ బ్యాటిల్' పోటీల్లో పాల్గొని 2022, 2023 సంవత్సరాల్లో టైటిల్ గెలిచింది హుమైరా. '2022లో 15 మంది అబ్బాయిలు నాకు పోటీగా వచ్చారు. నేను ఒక్కదాన్నే ఆడపిల్లను. నేనే గెలిచాను' అంటుంది హుమైరా. 'కశ్మీర్‌లో అమ్మాయిలు స్పోర్ట్స్‌లో, కళల్లో, చదువులో, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. ఆ విషయాన్ని నా పాటలో చెప్పాను' అందామె.

ఈ పాటలోనే మేల్ వాయిస్ ఇచ్చిన ఎం.సి.రా 'ఇక్కడ ఇప్పుడు జీన్స్ ప్యాంట్ అమ్మాయిలు తొడుక్కుంటున్నారు. బట్టల్ని బట్టి వారిని జడ్జ్ చేసే రోజులు పోయాయి' అనే లైన్‌లు పాడాడు. హుమైరా, ఎం.సి.రా కలిసి 'మై కశ్మీరి... మేరా దేశ్ హై హిందుస్తాన్' అని పాటను ముగిస్తారు.

ఈ పాటలో హుమైరా 'టెర్రరిస్టులకు ఇక్కడ చోటు లేదు. అనవసరంగా ఎవరి రక్తం పారడానికి వీల్లేదు' అనే లైన్లు పాడింది. 'నువ్వు చూపుతున్న అభివృద్ధి ఉత్తుత్తదే. అసలు వాస్తవం వేరే ఉంది అని కొందరంటున్నారుగా' అని విలేకరులు ప్రశ్నిస్తే 'అది వారి దృష్టికోణం. ఇది నా దృష్టికోణం' అంటుంది హుమైరా.

'కొంతమంది నన్ను ట్రోల్ చేస్తున్నారు. నేను పట్టించుకోను. నేను ఇలాగే ముందుకెళతాను. నా వెనుక ఒక్కరు నిలబడినా చాలు' అందామె.

కశ్మీర్ వెనుక హుమైరా వెనుక ఇప్పుడు చాలామంది ఉన్నారు. కశ్మీర్ అభివృద్ధికి అందరూ ప్రయత్నిస్తే 'నయా కశ్మీర్' దగ్గరిలోనే సాధ్యమవుతుంది.

ఊరు రమ్మంది..!

ఒక ఎంబీయే సర్పంచ్.. ఒక మోడల్ గ్రామం

ఛావీ రాజావత్ రాజస్థాన్‌లోని సోడా గ్రామంలో పుట్టి పెరిగింది. పట్నంలో ఉన్నత చదువులు చదివి, కళ్లు చెదిరే ప్యాకేజీతో కార్పొరేట్ ఉద్యోగంలో చేరింది. కానీ, చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి గ్రామానికి వెళ్లింది. సర్పంచ్‌గా ఎన్నికల్లో నిలబడి గెలిచింది. పదేళ్లపాటు సర్పంచ్‌గా పనిచేసింది. మొదటి ఎంబీయే మహిళా సర్పంచ్‌గా వార్తల్లో నిలిచి, యుఎన్‌లో ప్రసంగం చేసింది. గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దింది. ఇప్పుడు గ్రామాభివృద్ధికి కృషి చేస్తూనే, హోటల్ వ్యాపారం చేస్తోంది. ఆసక్తి గలవారికి గుర్రపు స్వారీలో శిక్షణ ఇస్తోంది.

"2010లో తొలిసారి సర్పంచ్ అయినప్పుడు గ్రామ పరిస్థితి ఏ మాత్రం బాగా లేదు. గ్రామం తీవ్ర కరువుతో అల్లాడిపోయింది. సాగునీరు లేదు. 13–14 సంవత్సరాలుగా రుతుపవనాలు లేవు. భూగర్భ జలాలను వాడుకోలేకపోయేవారు. 3–4 గంటలకు మించి విద్యుత్ సరఫరా లేదు. రోడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. డ్రెనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉంది. ఈ సవాళ్లతో సోడా పంచాయితీ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టాను. మొదటి టర్మ్‌లో కొన్ని పనులు పూర్తయ్యాయి.

మా ఊరు తనవైపు లాగింది..

మా తాత బ్రిగేడియర్ రఘుబీర్‌సింగ్ 1990 వరకు సర్పంచ్‌గా చేశారు. నాకు మా ఊరు అంటే ఎప్పుడూ ఇష్టమే. బెంగుళూరులోని రిషి వ్యాలీ స్కూల్, జైపూర్‌లోని మాయో కాలేజీ గర్ల్స్ స్కూల్‌లో చదువుకున్నాను. వేసవి సెలవులు వచ్చినప్పుడల్లా మా ఊరిలోనే ఉండేదాన్ని. ఢిల్లీలోని మహిళా శ్రీరామ్ కాలేజీ నుండి డిగ్రీ తీసుకున్నాక, పూణెలోని బాలాజా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మోడ్రన్ మేనేజ్‌మెంట్ నుండి ఎంబీయే పూర్తి చేశాను. ఏడేళ్లపాటు కార్పొరేట్ సెక్టార్‌లో వర్క్ చేశాను. లక్షల రూపాయల జీతం. కానీ, మా ఊరు వైపు నన్ను తన వైపు లాగింది.

■ మహిళకు రిజర్వ్ అని..

2010లో మా గ్రామ పంచాయితీ మహిళలకు రిజర్వ్ చేయబడింది. అప్పుడు మా ఊరి పెద్దలు నన్ను ఎన్నికల్లో నిలబడమని అడిగారు. ఆ సమయంలో సర్పంచ్‌ని అవ్వాలనే ఆలోచన కూడా చేయలేదు. గ్రామస్తులు మా అమ్మ నాన్నలను అడిగారు. 'ఏం చేయాలనుకున్నా తన ఇష్టం, మా బలవంతం ఉండదు' అని చెప్పారు. నాకు అప్పటి వరకు గ్రామ సభలు ఎలా జరుగుతాయి, పంచాయితీలకు నిధులు ఎలా వస్తాయో తెలియదు. ఆ విషయాలను గ్రామస్తులే చెప్పారు. ఆ విధంగా పంచాయితీ ఎన్నికల్లో నిలబడి, గెలిచాను. మా ఇంట్లో మా తాత తర్వాత నేను సర్పంచ్‌ని అయ్యాను.

■ వర్షపు నీటి సంరక్షణ

ముందుగా ఊరి భవితవ్యాన్ని ఒంటరిగా మార్చలేమని, ప్రజలంతా కలిసికట్టుగా కృషి చేస్తేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని అందరికీ స్పష్టంగా చెప్పాను. నేను వ్యూహంతో పనిచేయడం ప్రారంభించాను. ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, గ్రామాలను అనుసంధానించడం, కరువును ఎదుర్కోవడం నేను ఎదుర్కొన్న అతిపెద్ద సవాళ్లు. గ్రామంలోని నీటివనరులన్నీ పూడికతో నిండిపోయాయి. సుమారు 100 ఎకరాల్లో విస్తరించి ఉన్న నీటి వనరుల్లో పూడిక మట్టిని తొలగించేందుకు లక్షల రూపాయలు సేకరించి, ఖర్చు చేశాం.


ఛావీ రాజావత్

■ మహిళలు ముందు

గ్రామపంచాయితీ నా కుటుంబం లాంటిది. నేను మీటింగులు పెట్టడం మొదలు పెట్టగానే ఏయే ప్రాజెక్టుల్లో ఎలా పనిచేస్తున్నానో చెప్పేదాన్ని. ఈ ప్రాజెక్టుల గురించి వారు ఏమనుకుంటున్నారో అందరి అభిప్రాయాలు తెలుసుకునేదాన్ని. అలాగే,





ఎంత డబ్బు ఖర్చు అవుతుందో కూడా వివరించేదాన్ని. పనులు సజావుగా అయ్యేలా అధికారులను కలిసి ఆరా తీయమని గ్రామస్తులకు చెప్పేదాన్ని. మహిళల బృందం డిజైనర్ ల్యాంప్‌లు, కొవ్వొత్తులు, మసాలా దినుసులు వంటి ఉత్పత్తులు తయారు చేయడం మొదలుపెట్టారు. ఇవి మంచి ధరకు అమ్ముడు పోవడం మొదలయ్యింది. దీంతో మహిళల జీవితం మెరుగుపడింది. రెండేళ్లలో 950 ఇళ్లకు గాను 800 మరుగుదొడ్లు నిర్మించాం. 24 గంటలూ కరెంట్ అందుబాటులోకి వచ్చింది.

■ రోడ్ల ప్రాధాన్యత

నా ఎజెండాలో రోడ్ల ప్రాధాన్యత స్పష్టంగా ఉంచాను. ముందు ప్రైవేట్ బస్సుల సహాయం తీసుకున్నాను. బాలికల కోసం పాఠశాల, మహిళల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశాను. మూతపడిన బి.ఎడ్ కాలేజీని స్వాధీనం చేసుకొని దానిని బాలికల చదువుకోసం కేటాయించాను. ఓ ప్రైవేట్ కంపెనీ 200 టేబుళ్లు, బెంచీలను అందజేసి మా వెన్ను తట్టింది.

■ అందరికీ బ్యాంకు ఖాతా..

సర్పంచ్ అయిన ఐదేళ్లలోనే రోడ్లు, డ్రైన్లు, అందరికీ బ్యాంకు ఖాతా తెరిపించాను. ఎప్పుడూ ఫీల్డ్ వర్క్‌లోనే ఉండేదాన్ని. బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాల, చదువు ప్రాముఖ్యతను వివరించేదాన్ని.. నా స్వభావం అందరినీ కలుపుకొని ఉంటుంది. ఐక్యరాజ్య సమితి 11వ ఇన్ఫో పావర్టీ వరల్డ్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించినప్పుడు మొదటిసారి భారతదేశం నుండి ఒక మహిళా సర్పంచ్‌గా దేశం తరపున ప్రాతినిధ్యం వహించాను. ఇది నాకు గర్వంగా అనిపించింది. అక్కడ వారందరి మదిలో సర్పంచ్ అంటే తలపై ముసుగు వేసుకుని ఉన్న గ్రామస్థురాలు అనుకున్నారు. కానీ, నన్ను కార్పొరేట్ లుక్‌లో చూసి అందరూ ఆశ్చర్యపోయారు. సోడా విలేజ్ అభివృద్ధికి డబ్బు కంటే వ్యక్తులు, అందరి సమష్టి కృషి అవసరం అని ఫోరమ్‌లో చెప్పాను.

రెండుసార్లు సర్పంచ్‌గా నా విధులను నిర్వర్తించాను. తర్వాతి వారికి అవకాశాలు ఇవ్వాలని నేను మళ్లీ పోటీ చేయలేదు. ఇప్పుడు హోటల్‌ని నిర్వహిస్తున్నాను. గుర్రపు స్వారీ వచ్చు కాబట్టి, ఆసక్తి గలవారికి శిక్షణ ఇస్తున్నాను' అని వివరిస్తుంది ఈ యంగ్ లీడర్.

బాత్ చూపిన బాట

"ఎదుటి వారు చెప్పేది శ్రద్ధగా వింటే మనకు తెలియని ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీబాత్ కార్యక్రమంలో అనేక విషయాలను ప్రస్తావిస్తుంటారు. వాటిలో ఒకటి నన్ను ఏకంగా ఎంట్రప్రెన్యూర్‌గా మార్చింది. ఈరోజు నేను ఆర్గానిక్ ఎంట్రప్రెన్యూర్‌గా ఎదిగాను. అదే మన్‌కీ బాత్ కార్యక్రమంలో నన్ను ప్రశంసించడం ఎంతో సంతోషంగా ఉంది" అని చెబుతూ తెగ మురిసిపోతోంది వర్ష.


వర్ష

కర్ణాటకలోని చామరాజ్‌నగర్ జిల్లా ఆలహళ్లీ గ్రామానికి చెందిన వర్ష ఎమ్‌టెక్ చదివింది. చదువు పూర్తి కాగానే అందరిలా ఉద్యోగం కోసం చూడకుండా సరికొత్తగా ఏదైనా చేయాలనుకుంది. ఈ క్రమంలోనే ఏం చేయాలా అని ఆలోచిస్తున్న వర్ష.. ఓ రోజు అనుకోకుండా మన్‌కీబాత్ వినింది. ఆ కార్యక్రమంలో అరటి ఆకులను ఉపయోగపడే వనరులుగా ఎలా మారుస్తున్నారో మోదీ ప్రస్తావించారు. ప్రకృతిని ఇష్టపడే వర్షకు ఇది బాగా నచ్చడంతో.. అరటి బోదె, ఆకులతో హ్యాండిక్రాఫ్ట్స్ తయారు చేయాలని నిర్ణయించుకుంది.



వీడియో చూసి...

అరటి కాండాలను ఉపయోగపడే వస్తువులుగా ఎలా మార్చాలో వర్షకు తొలుత అర్థం కాలేదు. తరువాత యూట్యూబ్‌లో వెతికి ఒక వీడియో ద్వారా కొంత సమాచారం తెలుసుకుంది. కోయంబత్తూరు, తమిళనాడులోని మరికొన్ని ప్రాంతాల్లో అరటి వ్యర్థాలను అందమైన వస్తువులుగా ఎలా మారుస్తున్నారో వివరంగా తెలుసుకుంది. ఆ తరవాత వ్యాపారానికి కావాల్సిన యంత్రాలను కొనుగోలు చేసి ఉమ్మతూరు సమీపంలో 'ఆకృతి ఇకోఫ్రెండ్లీ' పేరిట ఎంటర్‌ప్రైజ్‌ను ఏర్పాటు చేసింది.

అరటికాండాలు, ఆకులను సేకరించి యంత్రాలతో ప్రాసెస్ చేసి నారతీసి, ఫ్లోర్‌మ్యాట్స్, బ్యాగ్స్, పర్సులు, హ్యాండీ క్రాఫ్ట్స్, అరటి గుజ్జు నుంచి తీసిన రసంతో సహజసిద్ధమైన ఎరువులు తయారు చేసి విక్రయిస్తోంది. కస్టమర్ల నుంచి మంచి ఆదరణ లభించడంతో ఆర్గానిక్ షాపులు, గూగుల్, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఆన్‌లైన్ షాపుల్లో సైతం ఆకృతి వస్తువుల విక్రయాలు జరుగుతున్నాయి. ఇలా అరటి వ్యర్థాలను అందమైన వస్తువులుగా మారుస్తూ కొంతమందికి ఉపాధి కల్పించడంతోపాటు.. రైతులకు ఆదాయం వచ్చేలా చేస్తోంది వర్ష.

వర్ష తన భర్త శ్రీకాంత్ సాయంతో చేస్తున్న ఈ ఇకో–ఫ్రెండ్లీ బిజినెస్ గురించి తెలియడంతో కొన్ని కంపెనీల నుంచి భారీగా ఆర్డర్లు వస్తున్నాయి. "భవిష్యత్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరించి ఎక్కువమందికి ఉపాధి కల్పిస్తాను" అని వర్ష చెబుతోంది. గ్రామాల్లోని మహిళలు సైతం వ్యాపారవేత్తలుగా మారేందుకు, ఉద్యోగం దొరకనివారు ఉపాధిని ఇలా సృష్టించుకోవచ్చని చెప్పడానికి ఉదాహరణగా నిలుస్తోంది వర్ష. నవంబర్ నెల మన్‌కీ బాత్ కార్యక్రమంలో వర్ష ఎంట్రప్రెన్యూర్ జర్నీ గురించి మోదీ ప్రస్తావించడం విశేషం.

యూత్ పల్స్

Generation Z

భవిష్యత్ చిత్ర'వర్ణ'మాల

కొత్త సంవత్సరం దగ్గరలో ఉంది. కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ 'హ్యాపీ న్యూ ఇయర్' పాట పాడగానే సరిపోతుందా? 'పాటతోపాటు ప్రణాళిక కూడా ఉంది' అంటుంది మన జెన్ జెడ్. కొత్త సంవత్సరంలో జెన్ జెడ్ లక్ష్యాలు, ప్రణాళికలు, అభిరుచులకు సంబంధించి 'ట్రెండ్ టాక్ రిపోర్ట్-2024' అద్దం పడుతోంది.

ఇండియా, యూఎస్, యూకే, బ్రెజిల్, సౌత్ కొరియా దేశాలలోని జెన్ జెడ్ ట్రెండ్స్‌కు సంబంధించి 'ట్రెండ్ టాక్ రిపోర్ట్'ను విడుదల చేసింది ఇన్‌స్టాగ్రామ్. వర్త్ గ్లోబల్ స్టైల్ నెట్‌వర్క్ (డబ్ల్యూజీఎస్ఎన్)తో కలిసి నిర్వహించిన ఈ సర్వేలో 2024 సంవత్సరానికి సంబంధించి ఫ్యాషన్, బ్యూటీ, సోషల్ మీడియా, ఫ్రెండ్‌షిప్‌కు సంబంధించిన ప్రశ్నలు జెన్ జెడ్‌ను అడిగారు.

ఈ రిపోర్ట్ ప్రకారం ఫ్యాషన్ ట్రెండ్స్, బ్యూటీ అండ్ ఫుడ్ విభాగాలలో మన దేశం ట్రెండ్ సెట్టర్‌గా ఉంది. ఫుడ్ విషయానికి వస్తే కొత్త రుచులను ఆస్వాదించడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇతరుల కంటే భిన్నంగా కనిపించే వస్త్రధారణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కొత్త హెయిర్‌స్టైల్‌ను ఎంపిక చేసుకుంటున్నారు.

2024కు సంబంధించి 'జెన్ జెడ్' ప్రాధాన్యతలలో హెల్త్, ట్రావెల్, కెరీర్‌లు మొదటి స్థానంలో ఉన్నాయి.

తమ కెరీర్‌పై ప్రధానంగా దృష్టి పెట్టబోతున్నట్లు 43 శాతం మంది తెలియజేశారు. ఇతర దేశాలతో పోల్చితే మన 'జెన్ జెడ్' వ్యాపారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. సంపద సృష్టికి వ్యాపారమే మార్గం అని చెబుతోంది.

మన దేశంలో 'జెన్ జెడ్'లో ఎక్కుమంది స్పోర్ట్స్‌కు సంబంధించి సూపర్ ఫ్యాన్స్ ఉన్నారు.

లైఫ్ అడ్వైజ్, తమ ప్రొఫెషన్‌కు సంబంధించి కంటెంట్‌కు ప్రాధాన్యత ఇచ్చేవారి సంఖ్య ఎక్కువగానే ఉంది.

జీఆర్‌డబ్ల్యూఎం(గెట్ రెడీ విత్ మీ)లాంటి క్రియేటివిటీతో కూడిన ఫ్యాషన్ ట్రెండ్స్‌పై అమిత ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. మన దేశంలో జెన్ జెడ్‌లో 44 శాతం మంది సొంత ఆలోచనలకు ప్రాధాన్యత ఇచ్చే డీఐవై(డూ-ఇట్-యువర్ సెల్ఫ్) విధానాన్ని ఇష్టపడుతున్నారు.

సంగీతం విషయానికి వస్తే ఏఆర్ రెహమాన్, శ్రేయా ఘోషల్, అనిరుథ్ నుంచి సౌత్ కొరియన్ మ్యూజిక్ బ్యాండ్ 'బీటీఎస్ ఆర్మీ' వరకు ఇష్టపడుతున్నారు. వారికి నచ్చిన వీడియో గేమ్స్‌లో ఫోర్ట్‌నైట్, కాల్ ఆఫ్ డ్యూటీ, రాబ్లక్స్... మొదలైనవి ఉన్నాయి.

గుడ్ ప్లానింగ్

2024లో యువతరం ఆసక్తి చూపుతున్న రంగాలలో ట్రావెల్ ఒకటి. ట్రావెల్ ప్రేమికులకు టాన్యాలాంటి ట్రావెల్ వ్లోగర్‌ల సలహాలు ఉపయోగపడుతున్నాయి. అడ్వర్‌టైజింగ్ రంగంలో ఉద్యోగం చేసిన టాన్యా సోలోగా ట్రావెలింగ్ మొదలు పెట్టి తాను వెళ్లిన ప్రదేశాలకు సంబంధించి వ్లోగింగ్ మొదలు పెట్టింది. యూట్యూబ్, ఎయిర్‌టెల్‌లాంటి పెద్ద కంపెనీలతో కలిసి పనిచేసింది. ట్రావెలింగ్‌పై ఆసక్తి ఉన్నవారికి గుడ్ ప్లానింగ్ అనేది ముఖ్యం అంటుంది టాన్యా. 'గుడ్ ప్లానింగ్'కు సంబంధించి టిప్స్ చెబుతుంటుంది.





ప్రణాళిక ఉండాలి

దిల్లీకి చెందిన మోనికా మాలిక్ బిజినెస్ అండ్ ఫైనాన్స్‌కు సంబంధించి కంటెంట్ క్రియేటర్‌గా చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది. పర్సనల్ ఫైనాన్స్ నుంచి స్టాక్‌మార్కెట్ వరకు ఎన్నో విషయాలను సులభంగా అర్థమయ్యేలా చెబుతోంది. 'ఒక రంగంపై ఇష్టం ఉన్నంత మాత్రాన విజయం చేరువ కాదు. భవిష్యత్ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలి. పరిశ్రమకైనా, వ్యక్తికైనా ఇది ముఖ్యం' అంటుంది మాలిక్.

జెన్ జెడ్‌లోని పదిమందిలో తొమ్మిదిమంది వారు ఇష్టపడే రంగాలకు సంబంధించి సెలబ్రిటీల అభిమానగణంలో ఉన్నారు. తమ అభిమాన సెలబ్రిటీలు, అథ్లెట్లు, క్రియేటర్ నుంచి జెన్ జెడ్ రాబోయే కాలంలో ఆశిస్తున్నది ఏమిటి? అనే ప్రశ్నకు వినిపించే జవాబు... లైఫ్ అడ్వైజెస్, వారి ప్రొఫెషన్‌కు సంబంధించిన కంటెంట్... ఇక మీమ్స్ విషయానికి వస్తే మూడింట ఒక వంతు మంది 'బ్యాడ్ టేస్ట్ మీమ్స్'ను తమ 'టాప్ టర్న్ ఆఫ్'గా ఎంచుకున్నారు.

గతం సంగతి ఎలా ఉన్నా భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి నిర్ణయాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో యువతరం ముందు ఉంటుంది. అభిరుచుల నుంచి కెరీర్ ఆప్షన్స్ వరకు కొత్తగా ఆలోచిస్తోంది.

'కాలేజీ చదువు పూర్తయిన తరువాత వైట్-కాలర్ జాబ్ తెచ్చుకోవాలి' అనేది సంప్రదాయ ఆలోచన. అయితే యువతరంలో అందరూ ఇలాగే ఆలోచించడం లేదు. 'కంఫర్టబుల్ లైఫ్‌స్టైల్'కు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీనికి కారణం జెనరేటివ్ ఏఐ. జెనరేటివ్ ఏఐ ప్రభావంతో వైట్-కాలర్ జాబ్స్‌కు ఉద్యోగభద్రత తక్కువ అనే అభిప్రాయం ఉంది. పియర్సన్ రిపోర్ట్ ప్రకారం జెనరేటివ్ ఏఐ వల్ల వైట్-కాలర్ ఉద్యోగాలలో 30 శాతం రిప్లేస్‌మెంట్ జరుగుతుంది. వైట్-కాలర్ జాబ్‌లతో పోల్చితే బ్లూ-కాలర్ జాబ్‌లకు అధిక ఉద్యోగ భద్రత ఉంది. రోబోట్స్ చేయలేని పనులు వీటిలో ఉండడమే కారణం. ఈ పనులు చేయడానికి ప్రత్యేక శిక్షణ, నైపుణ్యం అవసరం. అయితే జెన్ జెడ్‌లో ఎక్కువమంది ఈ హై-డిమాండ్ ఫీల్డ్‌పై ఆసక్తి ప్రదర్శించడం లేదు.

వైట్-కాలర్ జాబ్, బ్లూ-కాలర్ జాబ్ అనేదానితో సంబంధం లేకుండా ప్రతి ఉద్యోగికి విశ్లేషణాత్మక ఆలోచన విధానం, సమస్య పరిష్కార నైపుణ్యం, సమర్థవంతమైన కమ్యూనికేషన్, స్ట్రెస్ మెనేజ్‌మెంట్ స్కిల్స్... మొదలైన వాటికి సంబంధించి ప్రొఫెషనల్ స్కిల్స్ అవసరం. వీటిపై జెన్ జెడ్ ఆసక్తి ప్రదర్శిస్తోంది.

నిర్ణయాలు తీసుకోవడంలో 'లైఫ్‌స్టైల్' అనేది కీలకపాత్ర పోషిస్తోంది. డబ్బు నుంచి ఫ్రీ టైమ్ అండ్ ఫ్లెక్సిబిలిటీ వరకు ఎన్నో విషయాలను దృష్టిలో పెట్టుకుంటుంది జెన్ జెడ్.